ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- ప్రథమంలో 60.43శాతంతో జిల్లాకు రాష్ట్రంలో 15వ స్థానం
- ద్వితీయలో 68.85 శాతంతో జిల్లాకు రాష్ట్రంలో 16వ స్థానం

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఇంటర్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 60.43శాతంతో జిల్లాకు రాష్ట్రంలో 15వ స్థానం దక్కగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 68.85శాతంతో జిల్లా రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచింది. అదేవిధంగా వొకేషనల్ కోర్సుకు సంబంధించి ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 58.38శాతంతో జిల్లాకు రాష్ట్రంలో 18వ స్థానం రాగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.23శాతంతో జిల్లాకు రాష్ట్రంలో 15వ స్థానం దక్కింది. ఫలితాల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

జనరల్ కేటగిరిలో...

ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి మొత్తం 15,960 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 9644 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 6,573 మంది పరీక్షలకు హాజరు కాగా, కేవలం 3,087 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 46.96 శాతం బాలురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా బాలికలకు సంబంధించి 9,387 మందికి 6,557 మంది ఉత్తీర్ణత పొందారు. 69.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో బాలుర కంటే బాలికలు దాదాపు 23 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 60.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో జిల్లాకు 15వ స్థానం దక్కింది. గతేడాది 55.29 శాతం ఫలితాలతో 18వ స్థానంలో నిలిచింది.

ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి మొత్తం 14,259 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 9817 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 6,764 మంది పరీక్షలకు హాజరు కాగా, కేవలం 3,301 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 57.27శాతం బాలురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా బాలికలకు సంబంధించి 8,495 మందికి 6,516 మంది ఉత్తీర్ణత పొందారు. 76.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో బాలుర కంటే బాలికలు దాదాపు 20 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 68.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో జిల్లాకు 16వ స్థానం దక్కింది. గతేడాది 65.57 శాతం ఫలితాలతో 15వ స్థానంలో నిలిచింది.

వొకేషనల్ కేటగిరీలో...

ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి మొత్తం 1,958 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 1,143 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 812 మంది పరీక్షలకు హాజరు కాగా, కేవలం 329 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 40.52 శాతం బాలురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా బాలికలకు సంబంధించి 1,146 మందికి 814 మంది ఉత్తీర్ణత పొందారు. 71.03 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో బాలుర కంటే బాలికలు దాదాపు 31.50 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 58.38 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో జిల్లాకు 21వ స్థానం దక్కింది. గతేడాది 54.25 శాతం ఫలితాలతో 11వ స్థానంలో నిలిచింది.

ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి మొత్తం 1,468 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 1,075 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 578 మంది పరీక్షలకు హాజరు కాగా, 332 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 57.44శాతం బాలురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా బాలికలకు సంబంధించి 890 మందికి 743 మంది ఉత్తీర్ణత పొందారు. 83.48 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో బాలుర కంటే బాలికలు దాదాపు 26 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో జిల్లాకు 15వ స్థానం దక్కింది. గతేడాది 67.15 శాతం ఫలితాలతో 15వ స్థానంలో నిలిచింది. దీంతో అదే స్థానాన్ని కాపాడుకున్నట్టైంది.

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరికలు

కల్హేర్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్యాంక్ నాయకులు పార్టీని వీడి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం కల్హేర్ మండలం ఖానాపూర్ కే గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో పెద్ద శంకరంపేట్ మండలం విరోజీపల్లి గ్రామానికి చెందిన అమర్‌సేట్, కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రకాంత్ బీఆర్ఎస్‌లో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కల్హేర్ మండలాధ్యక్షుడు రాంసింగ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్‌సాగర్, భూమయ్య తదితరులు ఉన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

సదాశివపేట, ఏప్రిల్ 22: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెలా మొదటి వారంలో జీతాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ యూనియన్ కార్యదర్శి అంజయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులపై పనిభారం తగ్గించాలని, శానిటేషన్ పేరుతో డ్యూటీలోకి వచ్చి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే శానిటేషన్ విభాగంలో పనికి నియమించాలన్నారు. ప్రతినెలా సక్రమంగా జీతాలు రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చౌదరి మన్నేశ్, నగేశ్, అనిల్, నర్సిం హులు, కృష్ణ, సంతోష, రుక్కమ్మ, మొగులమ్మ, లక్ష్మి, ప్రమీల, జ్యోతి ఉన్నారు.

నల్లవల్లిలో నిరాహారదీక్ష చేస్తున్న మహిళా జేఏసీ నాయకులు

డంపింగ్ యార్డుపై నిరంతర పోరు

గుమ్మడిదల, ఏప్రిల్ 22: ప్యారానగర్ డంపింగ్ యార్డుపై పోరు ఆగదని రైతు జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షలు 77వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి గ్రామాల ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్న రైతుల పొట్ట కొట్టొదని తెలిపారు. ఇకనైనా సర్కారు స్పందించిన డంపింగ్ యార్డు అనుమతులు విరమించుకోవాలని సూచించారు. దీక్షలో నల్లవల్లి, ప్యారానగర్ రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

జేఎన్టీయూ వద్ద మోకాళ్లపై నిరసన

చౌటకూర్, ఏప్రిల్ 22:మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపడుతున్న సమ్మె నాలుగోరోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జేఎన్టీయూ ప్రధాన ద్వారం వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఇందులోభాగంగా మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించి అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. వెట్టిచాకిరి విముక్తి కోసం ఉన్నత ఆశయంతో ఆందోళన కొనసాగుతుందన్నారు. న్యాయంగా బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లలితకుమారి

ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలి

జహీరాబాద్, ఏప్రిల్ 22: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీడబ్ల్యూవో లలితకుమారి అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషన్ పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ తీసుకునే ఆహారం స్థానంలో పోషకాలుండే చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిఖలవణాలు లభిస్తాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రసాదం, అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త హేమలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో రెండు బర్రెలు మృతి

గుమ్మడిదల, ఏప్రిల్ 22: గుమ్మడిదలకు చెందిన రైతు కోర్పత్తి కృష్ణకు చెందిన రెండు బర్రెలు మంగళవారం సాయంత్రం పిడుగుపాటుతో మృతి చెందాయి. బర్రెల మృతితో జీవనోపాధి తుడిచిపెట్టుకుపోయిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ ఘటనతో రూ.2 లక్షల ఆస్తిని కోల్పోయానని వాపోయారు. ప్రభుత్వం స్పందించి కృష్ణను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రతిభకనబర్చిన అధికారులకు నగదు రివార్డు అందజేసిన కమిషనర్

శిక్షలు నేరస్తులకు హెచ్చరిక కావాలి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 22: డ్రగ్స్, గంజాయి కేసుల్లో పడే శిక్షలు నేరస్తులకు హెచ్చరిక కావాలని, ఆయా నేరాలకు మళ్లీ పాల్పడకుండా అధికారులు నిరోధించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో నాలుగు కేసుల్లో శిక్షలు పడేటట్లు చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మధుబాబును అభినందించి నగదు రివార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించటానికి ఎక్సైజ్ సిబ్బంది మరింత సమర్థంతవంతంగా పనిచేసి శాఖకు గుర్తింపు తేవాలని కోరారు. ఇటీవల కాలంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో మంచి నైపుణ్యం కనబరిచిందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్ఏ ఖురేషీ, ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, అదనపు ఎస్పీ భాస్కర్‌గౌడ్, డీఎస్పీలు తిరుపతియాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 22: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొందిన అభ్యాసకులకు మంగళవారం మూడో రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఓపెన్ స్కూల్ పదో తరగతికి సంబంధించి ఉదయం జరిగిన గణితం పరీక్షకు 2018 మంది అభ్యాసకులకు, 1838 మంది హాజరయ్యారు. 180 మంది గైర్హాజరయ్యారు. దీంతో 91శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన బిజినెస్ స్టడీస్ పరీక్షకు 27 మందికి 22 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఉదయం జరిగిన పొలిటికల్ సైన్స్ పరీక్షకు 2,875 మంది అభ్యాసకులకు 2,663 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరయ్యారు. దీంతో 93శాతం హాజరు నమోదైంది. ఆయా పరీక్షా కేంద్రాలను రాష్ట్రస్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతోపాటు, డీఈవో, పరీక్షల కమిటీ పర్యవేక్షించింది. ఎలాంటి మాల్‌ప్రాక్టీసింగ్ కేసు నమోదు కాలేదని డీఈవో వెల్లడించారు.

కూచిపూడిలో అనన్యకు గిన్నిస్ రికార్డ్

విద్యార్థిని అనన్యను సన్మానిస్తున్న కలెక్టర్ క్రాంతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 22: తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన మందపురం అనన్య కూచిపూడిలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ని సొంతం చేసుకుంది. కొల్లూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న అనన్య గత సంవత్సరం డిసెంబర్‌లో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కూచిపూడిలో ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థిని అనన్యను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ విద్యార్థిని అనన్యకు సూచించారు. కూచిపూడిలో అనన్య గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించినందుకు ఆమె తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు.

విజేతలకు స్వీటు తినిపిస్తున్న సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి

సత్తా చాటిన ప్రైవేటు కళాశాలలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 22: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని వివిధ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వొకేషనల్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 500 మార్కులకు ప్రవళిక 490 మార్కులు, మౌనిక 483 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు శ్రీజా 958, సమ్రీన్ 953 మార్కులు సాధించడంతోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ఉత్తమ ఫలితాలు సాధించారు. విజేతలను కళాశాల చైర్మన్ ధారాసింగ్ అభినందించారు.

సెయింట్ ఆంథోనీస్ కళాశాలలో..

సెయింట్ ఆంథోనీస్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి మరోసారి సత్తా చాటారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు ఫాతిమా 991 మార్కులు, శిరీష 990 మార్కులు సాధించగా, ఎంపీసీ విభాగంలో నందిని 989 మార్కులు, సయ్యదా మిన్‌హజ్ నజ్‌నీన్ 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. సీఈసీలో ఆయుశ్రీ చౌదరీ 957 మార్కులు, ఎంఈసీలో ఆమేషా జబీన్ 957 మార్కుల చొప్పున ఉత్తమ ఫలితాలు సాధించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ సలోమన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి అభినందించారు.

క్యాన్సర్ బాధితురాలికి

ఆర్థిక సహాయం

సదాశివపేట, ఏప్రిల్ 22: పట్టణానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు ఆమనికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద క్యాన్సర్ బాధితులకు అండగా ఉండేందుకు దాతలందరూ ముందుకు రావాలన్నారు. పేదలకు ఇలాంటి రోగాలు వస్తే కనీసం చికిత్స చేయించుకోవడానికి పైసలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆమనికి భర్త చనిపోగా ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. క్యాన్సర్ నరకాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని, పిల్లల కోసం బతుకున్నానని ఆమని తెలిపారు.

బీమా చెక్కు అందజేత

గుమ్మడిదల, ఏప్రిల్ 22: తాపీమేస్త్రీల కోసం ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం వల్లే నేడు తాపీమేస్త్రి కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని సీనియర్ నాయకుడు మహమ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ తీసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.లక్ష 30 వేలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గుమ్మడిదల మండలంలో మణికంఠ తాపీమేస్త్రి యూనియన్ బొంతపల్లి తాపీమేస్త్రి సంఘం సభ్యుడు దశరథ్ ప్రమాదవశాత్తు కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. అతడి కుటుంబానికి ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.లక్ష 30 వేలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గోవిందు, నారాయణ, వీరేశం, శేషగిరి, లక్ష్మీపతి ఉన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

జిన్నారం, ఏప్రిల్ 22: మండలంలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈకో క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రేమావతి మాట్లాడుతూ ప్రతి ఏటా ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొగిలి మాల, ఈకో క్లబ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

స్థలం కేటాయించాలి

గుమ్మడిదల, ఏప్రిల్ 22: మోడల్ మండలంగా తీర్చిదిద్దడానికి 50 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఇప్పటి వరకు మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించలేదన్నారు. గుమ్మడిదల మండల సమీపంలో 109 సర్వే నంబర్‌లో 150 ఎకరాల్లో ఇండియస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. దీని కోసం ప్రతిపాదనలు కూడా ప్రారంభయయ్యాయని చెప్పారు. ఆ సర్వే నంబర్‌లో ప్రజల సౌకర్యార్థం 50 ఎకరాల భూమిని మోడల్ మండలంగా తీర్చిదిద్దడానికి కేటాయించాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చౌటకూర్, ఏప్రిల్ 22: మండలంలోని హున్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హున్నాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాఘవ(35)కు భార్య దుర్గమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో భార్య దుర్గమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో ఇద్దరు కూతుళ్లతో కలిసి గ్రామంలోనే ఉంటూ కూలీ నాలి చేసుకుంటున్నారు. భార్య చనిపోయిందన్న బెంగతో తీవ్ర మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెందాడు. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. మృతుడి మామ వెంకటయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు బహుమతి అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి విద్య

పరిశ్రమల్లో భద్రతాచర్యలు పాటించాలి

హత్నూర, ఏప్రిల్ 22:పరిశ్రమల్లో భద్రతాచర్యలు పాటించాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారిని విద్య సూచించారు. మంగళవారం మండలంలోని గుండ్లమాచునూర్ శివారులోని ఎపిటోరియా పరిశ్రమలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు కేవలం లాభార్జనే ధ్యేయంగా పని చేయకుండా కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు వాటిని ఉపయోగించడంలో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి వుండాలన్నారు. కార్మికులు, ఉద్యోగులు ప్రమాదాలపై అవగాహన వుండటం వల్ల ప్రమాదాల బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. అనంతరం పలువురు కార్మికులు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఏవిధంగా నివారించవచ్చు అనే విషయంలో పలు రకాల విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఈహెచ్ఎస్ హెడ్ తపస్‌సాహు, ఉపాధ్యక్షుడు అమర్‌కుడాలే, ప్లాంట్‌హెడ్ వంక శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు దిగిన గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో ధ్వంసమైన విగ్రహం)

శివుడి విగ్రహం ధ్వంసం..గ్రామస్తుల ఆందోళన

జిన్నారం, ఏప్రిల్ 22: మండలకేంద్రం సమీపంలోని శివాలయం గుట్టపై ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని కొందరు విద్యార్థులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విద్యార్థులను ప్రశ్నించగా భయంతో మదర్సాలోకి పరుగులు తీశారు. విగ్రహం ధ్వంసంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు పెద్దవత్తున మదర్సా ఎదుట ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారం చుట్టుపక్కల గ్రామాలతోపాటు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఓ దశలో పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు రంగప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఈలోగా గ్రామస్తులు దాదాపు 200 మంది మదర్సాలోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఘటనా స్థలానికి పటాన్‌చెరువు డీఎస్పీ రవీందర్ రెడ్డి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. దీంతో ఆందోళనకారులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఘటనకు కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పాఠశాలలో మొక్కలు నాటుతున్న గుడ్ యూనివర్స్ సంస్థ ప్రతినిధులు

మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గించాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 22: మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గించాలని గుడ్ యూనివర్స్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిధి కమల్‌నాయక్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ యూనివర్స్ ఎన్‌జీవో నేతృత్వంలో హమాండ్ పవర్ సొల్యూషన్స్ వారి సహకారంతో విద్యార్థుల కోసం హ్యాండ్‌వాష్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం 400 మొక్కలను పాఠశాల ఆవరణంలో నాటారు. బాలికలకు సానిటరీ జ్ఞాపిన్స్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేడు మనం నాటిన మొక్కలు చెట్లుగా మారి భవిష్యత్తు తరాలను కాపాడుతాయని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తామని సంస్థ ప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, సంస్థ ప్రతినిధులు శైలేందర్, శేఖర్‌దినేశ్, ఉపాధ్యాయులు హరిశంకర్, రేణుక, ఇందిరా, అనురాధ, రజిత తదితరులు పాల్గొన్నారు.

మంజీరాను కాలుష్యం నుంచి కాపాడాలి

సంగారెడ్డి, ఏప్రిల్ 22: మంజీరా జలాలను నక్కవాగు కాలుష్యం నుంచి కాపాడాలని, మంజీరా నది మరో మూసి నది కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. మంగళవారం నది పరీవాహక గ్రామాల ప్రజలతో కలిసి మంజీరాను కాపాడాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ..నక్కవాగు కాలుష్యం నీరు మంజీరాలోకి రాకుండా అరికట్టకపోతే భవిష్యత్ తరాలకు మంజీరా మరో మూసిగా మారే ప్రమాదం ఉందన్నారు. పటాన్‌చెరువు ప్రాంతంలోని పాశమైలారం, ముత్తంగి, సంగారెడ్డి పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి నక్కవాగు చౌటకూర్ మండలం ఏటిగడ్డలింగంపల్లి గ్రామం దగ్గర మంజీరాలో కలుస్తుందన్నారు. ఇప్పటికే నక్కవా